క్లుప్తంగా

వసతి గృహానికి కంప్యూటర్



బాలలకు కంప్యూటర్‌ను అందజేస్తున్న హెల్పింగ్ టు అదర్స్ నాయకులు

తిరుపతి మంగళం: బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా మంగళంలోని ప్రభుత్వ బాలుర వసతి సముదాయంలోని బాలలకు హెల్పింగ్ టు అదర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మణికంఠ, సభ్యులు రఘునాథ్, శ్రీనివాస్, నాగరాజు కంప్యూటర్‌ను బహూకరించారు. ప్రభుత్వ బాలుర వసతి సముదాయం సూపరింటెండెంట్లు ఎం.షణ్ముఖరావు, కె.సుధాకర్, ఎస్.త్రినాథ్‌రావు, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.మోహన్‌బాబు, వి.శ్రీధర్, బాలలు పాల్గొన్నారు.

శ్రీనివాసులునాయుడుకి నివాళి



శ్రీనివాసులునాయుడికి నివాళులర్పిస్తున్న మోహిత్‌రెడ్డి

పాకాల: ఆదినపల్లి పంచాయతీలో మృతి చెందిన శ్రీనివాసులునాయుడుకి(95) తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నివాళులర్పించారు. ఆదివారం మృతుడు నివాసం గుట్టకింద ఇండ్ల గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని, అన్ని సమయాల్లో అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు చిరస్మరణీయం

తిరుపతి అలిపిరి: వందేళ్లుగా ఆంధ్రాబ్యాంకు ఉద్యోగులు ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని.. విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి శేషాద్రినాయుడు అన్నారు. ఆదివారం తిరుపతి కపిలతీర్థం రోడ్డులోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన ఆంధ్రాబ్యాంకు శతాబ్ది ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆంధ్రాబ్యాంకు రిటైర్డ్ మేనేజర్లను, పలు విభాగాల్లో సేవలందించిన ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత జనరల్ మేనేజర్ దొరస్వామి, చంద్రమోహన్‌రెడ్డి, నరేంద్రనాథ్‌రెడ్డి, సుభాష్‌చంద్రా రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, రామ్మూర్తిరెడ్డి, నాధమునిరెడ్డి, వేణుగోపాల్, పలు జిల్లాల నుంచి రిటైర్డ్ ఆంధ్రాబ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

విజయవంతంగా కంటి వైద్య శిబిరం



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పాకాల: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విజయవంతంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆదివారం చెన్నై శంకర నేత్రాలయం, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ సహాయ సహకారాలతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడే 66 మంది వైద్య శిబిరానికి రాగా అందులో 21 మంది కంటి ఆపరేషన్లు చేయాలని వైద్యులు నిర్ధారించారు. వీరిని చెన్నైకి తీసుకెళ్లి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసి, భోజనం, వసతి ఏర్పాటు చేసి తిరిగి గురువారం తమ స్వగ్రామంలో వదలనున్నట్లు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయ్‌బాబు, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ మచ్చా కృష్ణమూర్తి, జీఎంటీ మెంబర్ ఆర్.వి.ప్రసాద్, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ మస్తాన్, రామయ్య, గురుస్వామినాయుడు, కుప్పుస్వామినాయుడు, దొరస్వామినాయుడు, తులసీరామన్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఆలయ ప్రాకారోత్సవం



ఊరేగింపునకు బయలుదేరుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ముందుగా అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈవో కేఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం



గంగమ్మ ఆలయ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



పూర్ణాహుతిలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఆదివారం కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం వేడుకగా నిర్వహించారు. అవివాహితులకు వివాహం జరగాలనే సంకల్పంతో ప్రతి నెలా శ్రవణా నక్షత్రం రోజున ఈ అమ్మవారి ఆలయంలో ఈ కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం చేపట్టడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలోని ప్రత్యేక హోమ మండపంలో అమ్మవారిని కొలువుదీర్చి, అర్చక పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష పాల్గొని కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం పూర్ణాహుతిలో పాల్గొని పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కె.గోపియాదవ్, ఈవో మమత, వైఎస్ఆర్ సీపీ సీనియర్ నేతలు పాలగిరి ప్రతాప్ రెడ్డి, దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ పనుల పరిశీలన

శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో చేపడుతున్న ఆలయ పునర్నిర్మాణం పనులను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఇప్పటి వరకు చేపట్టిన పనులను క్షుణ్ణంగా పరిశీలించి చేపట్టాల్సిన పనుల గురించి తెలియజేశారు. ఆలయ పనులను ఆలస్యం లేకుండా నాణ్యతలో రాజీ లేకుండా చేపట్టాలని సూచించారు.

ఘనంగా కార్తీక వనభోజన మహోత్సవం



దివ్యారామంలో కార్తీక వనభోజన మహోత్సవం

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లాలోని తోట కుటుంబాల వారి కార్తీక మాస వనభోజన మహోత్సవ పూజా కార్యక్రమం ఆదివారం దివ్యారామంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని తోట కుటుంబీకులు అందరూ ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. నామ గోత్రాలతో తులసి, ఉసిరి మొక్కలకు ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణం నిర్వహించారు. తోట వారి ఇలవేల్పు శ్రీభువనేశ్వరి దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సౌభాగ్య వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు స్వామి గిరీష్, తోట వారి కార్తీక వనభోజన మహోత్సవం ఆహ్వాన కమిటీ సభ్యులు తోట జయరాం, తోట వీర మనోహర్, రాంసాయి, అమరనాథ్, బాలాజీ, చలం, జయంతి, లోకేష్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రామ్మూర్తి



రామ్మూర్తిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పాకాల: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కొత్తకోట రామ్మూర్తి ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంఈఓ బాబ్జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ రామ్మూర్తి గత 33 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా, సంఘం నాయకుడిగా ఎన్నో పోరాటాలు చేశారని తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడు ప్రభు, గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామయ్య, యువరాజు, చంద్రశేఖర్, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

నేడు, రేపు ఉచిత శస్త్ర చికిత్సా శిబిరం

తిరుపతి ఎడ్యుకేషన్: ప్రపంచ పైల్స్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 20, 21వ తేదీల్లో తిరుపతి తాతానగర్‌లోని సుమన ఆనోరెక్టల్ ఆసుపత్రిలో ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పైల్స్, ఫిస్టులా వ్యాధులకు ఉచిత శస్త్ర చికిత్సా శిబిరం నిర్వహించనున్నారు. ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ ఎం.భాస్కర్‌రావు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పైల్స్, ఫిస్టులా వ్యాధులు ఎలా వస్తాయి, రాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన నివారణోపాయం, ఆహార నియమాలు వంటి వాటిపై సామాన్య ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కామోస్కోప్ యంత్రం ద్వారా పైల్స్ వ్యాధి నిర్ధారణ చేయడంతో పాటు అవసరమైన వారికి క్షారసూత్ర, క్షారకర్మ, అగ్నికర్మ విధానంలో ఉచితంగా శస్త్ర చికిత్స చేయనున్నట్లు తెలిపారు.

బిగ్ స్క్రీన్‌పై ఫైనల్స్



క్రికెట్ అభిమానులతో కలిసి ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



తుమ్మలగుంటలో బిగ్ స్క్రీన్‌పై మ్యాచ్‌ను తిలకిస్తున్న వేలాది మంది క్రికెట్ అభిమానులు

తిరుపతి రూరల్: భారత్- ఆస్ట్రేలియా మధ్య ఆదివారం జరిగిన వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ (బిగ్ ఫైట్)ను క్రికెట్ అభిమానులు బిగ్ స్క్రీన్ మీద వీక్షించారు. తుమ్మలగుంట వద్దనున్న కేవీఎస్ గ్రౌండ్‌లో 14 అడుగుల ఎత్తు 40 అడుగుల వెడల్పుతో భారీ బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. మ్యాచ్ తిలకించేందుకు వచ్చిన క్రీడాభిమానులకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి అన్ని వసతులు కల్పించారు. మ్యాచ్ ప్రారంభం నుంచి ఉచితంగా త్రాగు నీరు అందిస్తూ సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజన సౌకర్యం కూడా కల్పించారు.


ఆకట్టుకున్న డీజే సౌండ్స్

బిగ్ స్క్రీన్ మీద బిగ్ ఫైట్ తిలకిస్తున్న క్రికెట్ క్రీడాభిమానులకు స్పెషల్ ఎఫెక్ట్స్‌గా ఏర్పాటు చేసిన డీజే సౌండ్స్ ఆకట్టుకుంది. డీజే సౌండ్స్, లైటింగ్‌తో క్రీడాభిమానులకు స్క్రీన్ మీద కాకుండా స్టేడియంలో నేరుగా మ్యాచ్ తిలకించామన్న అనుభూతి కలిగింది. మ్యాచ్ తిలకించేందుకు వచ్చిన క్రీడాభిమానులకు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి దగ్గరుండి భోజనం వడ్డిస్తూ ఎంతో ఆప్యాయతను పంచుకున్నారు.

పుష్పార్చన

తిరుమల శ్రీవారికి ఆదివారం పుష్పయాగం వేడుకగా నిర్వహించారు. టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో సమకూర్చిన సువాసనభరిత పుష్పాలతో శ్రీవారికి పుష్పయాగం ఘనంగా చేపట్టారు. అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించారు.

–తిరుమల



పుష్పయాగానికి సిద్ధంగా ఉన్న సువాసనభరిత పుష్పాలు



తిరుమల శ్రీవారికి స్నపన తిరుమంజనం



ఉద్యానవన అధికారికి సన్మానం



పుష్పయాగంలో పాల్గొన్న టీటీడీ ఈవో దంపతులు



పుష్పయాగానికి తరలుతున్న బుట్టలకొద్దీ పుష్పాలు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యాలతో ప్రేక్షకులను అలరిస్తున్న కళాకారులు



తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భరతనాట్యం అలరించాయి. తిరుపతికి చెందిన శ్రీనృత్యాంజలి అకాడమీ ఆఫ్ మ్యూజికల్ డ్యాన్స్ నాట్య గురువులు సుబ్రమణ్యం, లక్ష్మీల ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన భరతనాట్యం కార్యక్రమం ఆకట్టుకుంది. వివిధ పాటలకు కళాకారులు హర్షిత, మోక్షిత, పూర్వఅజ్ఞా, సాత్విక, హృద్య, రక్షశ్రీ, శ్రీనిధి, కార్తీక, నిత్యప్రకాష్, జతిన్, జాశ్రిత, మాలిక, దాన్య, గురు నిశ్చల, దేదీప్య, ఓహోహాసినిల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీపల్లికొండేశ్వర స్వామివారి సేవలో జేసీ



జాయింట్ కలెక్టరుకి ఆలయ మర్యాదలు చేస్తున్న చైర్మన్, అర్చకులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి పళ్లికొండేశ్వర స్వామి దేవాలయానికి ఆదివారం తిరుపతి జాయింట్ కలెక్టరు డి.కె.బాలాజీ ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజి రెడ్డి, ఆలయ కార్య నిర్వాహణ అధికారి కె.రామచంద్రా రెడ్డి అర్చకులతో కలిసి ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభ స్వాగతం పలికి, స్వామి అమ్మవార్ల దర్శనం ఏర్పాటు చేశారు. దర్శనం అనంతరం ఆలయ ప్రదోష మండపంలో ఆలయ అర్చకులతో వేదమంత్రాల నడుమ ఆశీర్వదించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని కలెక్టరుకి అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు కె.ఆనంద్, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం భావ్యం కాదు



వైఎస్ఆర్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్ తదితరులు



కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు



మాట్లాడుతున్న తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మెన్ కట్టా గోపియాదవ్ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్: పవిత్ర పుణ్యక్షేత్రంగా, ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుపతి నగర అభివృద్ధిని అడ్డుకుంటున్న బీజేపీ నాయకుడు భానుప్రకాష్‌రెడ్డికి ఇది భావ్యం కాదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. ట్రాఫిక్, ఇతర సమస్యలు లేకుండా నగరాన్ని అభివృద్ధి చేయడానికి టీటీడీ నిధుల్లో 1శాతం కేటాయించాలని దేవాదాయ చట్టంలోని 111సెక్షన్ మేరకే టీటీడీ పాలకమండలి నిర్ణయం తీసుకుందన్నారు. తిరుపతి ఎయిర్‌పోర్టు, తిరుమలకు తిరిగే నీకు 46 మురికివాడలు ఉన్నాయన్న విషయం తెలుసా అని ప్రశ్నించారు. తిరుపతి ఎమ్మెల్యేగా, టీటీడీ బోర్డు చైర్మన్‌గా తిరుపతి అభివృద్ధికి భూమన కరుణాకర రెడ్డి, ఆయన తనయుడు భూమన అభినయరెడ్డి ఎంతగానో కృషి చేస్తుంటే ఓర్వలేకనే ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తిరుపతి అభివృద్ధిని ఇలానే అడ్డుకుంటూ ఉంటే తిరుపతిలో తిరగనివ్వబోమని దళితులుగా తాము హెచ్చరిస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్ఆర్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్లానిబాబు, నాయకులు తాళ్లూరు ప్రసాద్, మోహన్‌బాబు, నాగార్జున, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

భాను.. నువ్వు భస్మాసురరెడ్డివి..

తిరుపతి అభివృద్ధికి ఆటంకంగా మారిన భానుప్రకాష్‌రెడ్డి అభినవ భస్మాసురరెడ్డి అని వైఎస్ఆర్ సీపీ కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తిరుపతి అభివృద్ధికి టీటీడీ 1శాతం నిధులు కేటాయించేలా తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ భానుప్రకాష్‌రెడ్డి చేస్తున్న పనులు శోచనీయమని తెలిపారు. అభివృద్ధిని అడ్డుకుంటూ ఉంటే తిరుపతి ప్రజలు తగిన గుణపాఠం నేర్పుతారని ఆయన హెచ్చరించారు. కార్పొరేటర్లు శేఖర్‌రెడ్డి, మునిరామిరెడ్డి, మున్సిల్ కోఆప్షన్ సభ్యులు వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు మునిరామిరెడ్డి, పాండు, మధుసూదన్‌నాయుడు పాల్గొన్నారు.

దర్శన టికెట్లను అమ్ముకోలేదా భాను..

టీటీడీ బోర్డు సభ్యునిగా రెండేళ్ల కాలవ్యవధిలో శ్రీవారి దర్శన టికెట్లను అమ్ముకుని కోట్లు గడించిన నువ్వు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు కట్టా గోపియాదవ్ విమర్శించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. శ్రీవారి దర్శన టికెట్లు అమ్ముకుని కోట్లు గడించిన విషయాన్ని నీ పార్టీ వారే కథలుకథలుగా చెబుతున్నారని పేర్కొన్నారు. దొడ్డిదారిన బోర్డు సభ్యుని పదవి దక్కించుకున్న నువ్వు చంద్రబాబు నాయుడికి ఇక్కడి నుంచి డబ్బులు చేరవేస్తూ కొరియర్ బాయ్‌గా చేసిన పనులు తెలియదనుకున్నావా అని ప్రశ్నించారు. తిరుపతి కోఆపరేటివ్ బ్యాంకు ఉపాధ్యక్షుడు వాసుయాదవ్ మాట్లాడుతూ శ్రీనివాస సేతు విషయంలోనూ కోర్టుకెళ్లి తిరిగి వెనక్కు కేసును తీసుకున్న నీవు ఎంత ముడుపులు తీసుకున్నావని ప్రశ్నించారు. నీకు డబ్బులే కావాలంటే తిరుపతి ప్రజలందరూ చందాలేసుకుని ఇస్తామని, దయచేసి తిరుపతి అభివృద్ధిని మాత్రం అడ్డుకోవద్దని సూచించారు. ఈ విలేకర్ల సమావేశంలో కార్పొరేటర్ రత్నకుమారి, యువజన విభాగం నాయకుడు అరుణ్‌యాదవ్, నాయకులు గీతాయాదవ్, చింతారమేష్‌యాదవ్, భరణియాదవ్, చైతన్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పుష్పాభిషేకం

తిరుచానూరు బ్రహ్మోత్సవాల అనంతరం ఆదివారం శ్రీపద్మావతి అమ్మవారికి పుష్పయాగం వేడుకగా నిర్వహించారు.



